## సాగు నీరు అందించాలి



తపాలాపూర్ ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న రైతులు

జన్నారం, ఏప్రిల్ 8 : జన్నారం మండలంలోని కడెం 22వ డిస్ట్రిబ్యూటరీ కింద పంటలకు మరో రెండు తడులకు సాగునీరు అందించాలని రాపూర్, తిమ్మాపూర్, తపాలాపూర్ గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాన రహదారిపై మంగళవారం వరి గొలుసులు చేతపట్టుకొని నిరసన తెలిపారు. నీరు అందించపోతే దాదాపు 100 ఎకరాల వరకు పంటలు పట్టిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కడెం ఉన్నతాధికారులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పందించి, నీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ చింతగూడ వైస్ చైర్మన్ కమ్మల విజయకుమార్, రైతులు మామిడి భూమన్న, ఆకుల రవికుమార్, మడ్మెల్ల కొమురయ్య, జిల్ల రాజన్న, కాంద్ర లచ్చన్న, ఎల్లయ్య పాల్గొన్నారు.

## మహాసభలు విజయవంతం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

తాండూర్, ఏప్రిల్ 8 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో 12, 13, 14 తేదీల్లో నిర్వహించే ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మండిగ రవీందర్ పిలుపునిచ్చారు. తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం గిరిజన సంఘాల నాయకులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆదివాసుల అస్తిత్వంపై కొనసాగుతున్న దమనకాండకు వ్యతిరేకంగా పోరాటాలు చేసేందుకు భవిష్యత్ కార్యాచరణ, మనుగడపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండలాధ్యక్షుడు కోవ బాబు రావ్, ప్రధాన కార్యదర్శి యాపల సమ్మయ్య, క్షిష్టంపేట మాజీ సర్పంచ్ గడ్డం మణికుమార్, తుడుందెబ్బ నాయకులు సోయం లింబారావ్, పెందురం రఘు, తొడసం లింగు, పల్లె వెంకటేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

జన్నారం, ఏప్రిల్ 8 : జన్నారం మండల కేంద్రంలో తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి నానేశ్వర్, మండలాధ్యక్షుడు రాయిసిడం కాశి, సోనేరావ్ ఆధ్వర్యంలో మహాసభల పోస్టర్ విడుదల చేశారు. ఈ సభలకు ఆదివాసీ గిరిజనులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## నీటి ఎద్దడి లేకుండా చూడాలి

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 8 : శ్రీరాంపూర్ ఏరియాలోని కార్మిక కాలనీల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేష్, నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్ మంగళవారం ప్రకటనలో యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. 45 నిమిషాలకు బదులు గంట పాటు కాలనీలో నీటి సరఫరా చేయాలని తెలిపారు. సీసీసీలో నిర్మిస్తున్న ర్యాపిడ్ గ్రావిటీ ఫోర్స్ ఫిల్టర్ బెడ్ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని, వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌కాలనీ, ఆర్కే-8 కాలనీ, సీసీసీ ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, క్వార్టర్లలో రూఫ్ లీకేజీలు, రిపేర్లు చేయాలని కోరారు.

## సారూ.. భూమి పట్టా చేయండి

నెన్నెల, ఏప్రిల్ 8 : తన భార్య సంద్ర అమృత పేరిట ఉన్న భూమి మరొకరి పేరున పట్టా అయ్యిందని, అధికారులు స్పందించి తిరిగి తమకు పట్టా చేయాలని మైలారం గ్రామానికి చెందిన గిరిజన వ్యవసాయ కూలీ సంద్ర శంకర్ కోరారు. ఈ సందర్భంగామంగళవారం ఆయన మాట్లాడారు. తన భార్య అమృత పేరిట గొల్లపల్లి శివారులోని సర్వే నంబర్ 221/1/2బీ లో గల అసైన్డ్‌భూమిని మరో వ్యక్తికి అధికారులు పట్టా చేశారని ఆరోపించాడు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయాడు. ఎనిమిది నెలలుగా న్యాయం కోసం తిరుగుతున్నాని తెలిపాడు. చివరికి స.హ చట్టం కింద దరఖాస్తు చేసుకుంటే తమకు తెలియదని, కార్యాలయంలో ఎలాంటి రికార్డులు లేవని అధికారులు జవాబు ఇచ్చారన్నాడు. అయితే చిన్న వెంకటాపూర్‌లో కందూరి శ్రావ్య రెడ్డికి ఇలాంటి సమస్యే ఎదురైతే, వారి ఫిర్యాదు మేరకు తిరిగి పట్టా చేశారని పేర్కొన్నాడు. ఉన్నత వర్గానికి చెందిన వారికో న్యాయం, గిరిజనుడినైన తనకో న్యాయమా అని అధికారులను ప్రశ్నించాడు. ఆమెకు చేసినట్లుగానే తన భూమిని కూడా పట్టాచేయాలని కోరాడు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

తాండూర్, ఏప్రిల్ 8 : గర్భిణులు, బాలింతలు, పిల్లలు పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీవో స్వరూపారాణి అన్నారు. పోషణ పక్వాడ్‌లో భాగంగా మంగళవారం తాండూర్ ఐబీ ఏరియా-1 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పోషక ప్రయోజనాలు గురించి తల్లులు, సంరక్షకులు, గర్భిణులు, తల్లులకు వివరించారు. ఎంఈవో ఎస్ మల్లేశం, సూపర్‌వైజర్లు రమాదేవి, ప్రసన్న, అంగన్‌వాడీ టీచర్లు లీలారాణి, రాజేశ్వరి, లక్ష్మి, ఉమారాణి, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎం, ఆయాలు, తల్లులు, పిల్లలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కాసిపేట, ఏప్రిల్ 8 : బుగ్గగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషన పక్వాడ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక ప్రారంభించారు. టీచర్ రాజమణి, హెల్పర్, ఆశకార్యకర్త పావణి, గర్భిణులు, బాలింతలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

మంచిర్యాల (ఏసీసీ), ఏప్రిల్ 8 : జిల్లా కేంద్రంలోని ఏసీసీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషన పక్వాడ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ ఎన్ పద్మ, సహాయకురాలు లత పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ కార్యవర్గం

లక్సెట్టిపేట, ఏప్రిల్ 8 : పట్టణంలోని న్యాయస్థానంలో సోమవారం రాత్రి బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా కొమిరెడ్డి సత్తన్న, ప్రధాన కార్యదర్శిగా ఎస్ ప్రదీప్ కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా నళిని కాంత్, జాయింట్ సెక్రటరీగా ఎన్ సత్యగౌడ్, లైబ్రరీ సెక్రటరీగా షఫీక్, క్రీడలు, సాంస్కృతిక సభ్యులుగా బీ సంతోష్, లేడీ రిప్రజెంటేటివ్‌గా పద్మ, కార్యనిర్వాహక సభ్యులుగా రెడ్డిమల్ల ప్రకాశం, రహమతుల్ల, సదాశివ్ ఎన్నికయ్యారు. ఎలక్షన్ అధికారులుగా గోవిందరావు, పాల్సన్ వ్యవహరించారు. వారిని సత్కరించారు. న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవా శిబిరం

బెల్లంపల్లి, ఏప్రిల్ 8 : పట్టణంలోని రూరల్ బస్టాండ్ వద్ద మంగళవారం బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో వినియోగదారుల సేవా శిబిరం నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్ కనెక్షన్, రీచార్జ్, పోస్ట్ పెయిడ్, ప్రీ పెయిడ్ ఫిర్యాదులు, బిల్లులకు సంబంధించి సమస్యలను వినియోగదారులు సదరు సిబ్బంది దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్నింటిని తర్వాత పరిష్కరించనున్నట్లు డీఈ శ్రీధర్ తెలిపారు. 1 నుంచి 30వ తేదీ వరకు వినియోగదారుల సేవా మాసంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. బీఎస్ఎన్ఎల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వందశాతం అక్షరాస్యత విజయవంతం చేయాలి

కాసిపేట, ఏప్రిల్ 8 : వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యతను విజయవంతం చేయాలని కాసిపేట ఎంపీవో శేక్ సఫ్దర్ అలీ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని విజయ లక్ష్మి అక్షరాస్యత, కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. శిక్షణ పొందుతున్న వలంటీర్లతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఐదుగురికి చదువు చెప్పాలని, కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యా మండల డీఆర్పీ బండ శాంకరి, స్కూల్ అసిస్టెంట్ కృష్ణ గోపాల్ రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, అంగన్‌వాడీ టీచర్ సంగీత, మహిళలు పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి చర్యలు

- జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్



మాట్లాడుతున్న షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

నస్పూర్, ఏప్రిల్ 8 : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో గల మిలీనియం హాలులో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో షెడ్యూల్డ్ కులాల జాతీయ కమషన్ సంచాలకుడు సునీల్ బాబు, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్, కోయ శ్రీహర్ష, మంచిర్యాల డీసీపీ భాస్కర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు చేపట్టి, పరిహారం అందించాలన్నారు. ఎఫ్ఐఆర్ కన్విక్షన్లకు సంబంధించి సరైన విధంగా పోలీసు శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కులాంతర వివాహం చేసుకున్న వారికి ప్రభుత్వం అందించే నగదును అర్హత గల వారికి త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు అట్రాసిటీ కేసులకు సంబంధించి పరిహారం విషయంలో జిల్లాలో 2022 వరకు పరిహారం అందించడం జరుగుతుందన్నారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించడంలో భాగంగా 2024-25 సంవత్సరానికి గాను రూ.35 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. 14 కులాంతర వివాహ జంటలకు అందించినటుల వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణి ఉద్యోగులనే నియమించాలి

రెబ్బెన, ఏప్రిల్ 8 : సింగరేణిలో సెక్యూరిటీగార్డులుగా సింగరేణి ఉద్యోగులనే నియమించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు గోలేటి జీఎం కార్యాలయంలో మంగళవారం జీఎం విజయభాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కారుణ్యం ద్వారా సింగరేణిలో సుమారు 15 వేల మంది యువ కార్మికులు ఉన్నారని గుర్తుచేశారు. అయినా సెక్యూరిటీ గార్డులుగా హైదరాబాద్, ముంబైకి చెందిన కాంట్రాక్టర్లకు టెండర్లు ఇచ్చి సింగరేణి ధనాన్ని యాజమాన్యం వృథా చేస్తున్నదన్నారు. చదువుకున్న యువ కార్మికులు ఉన్నా సరిగా పనిచేయరని సాకు చెబుతూ ప్రైవేట్ కాంట్రాక్టర్లకు సెక్యూరిటీ గార్డు టెండర్లు ఇవ్వడాన్ని టీబీజీకేఎస్ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధరవాత్ మంగీలాల్, ఏరియా కార్యదర్శి అలవేని సంపత్, సెంట్రల్ కమిటీ సభ్యుడు ఓరం కిరణ్, పిట్ కార్యదర్శులు మెరుగు రమేశ్, గాజవేని శ్రీనివాస్, కమిటీ సభ్యులు చంద్రయ్య పాల్గొన్నారు.

## దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలి



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 8 : రాజీవ్ యువ వికాసం కోసం అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి సందర్శించారు. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ ఈడీ సజీవన్, తహసీల్దార్ రోహిత్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, ఏప్రిల్ 8 : రాజీవ్ యువ వికాసం పథకం కోసం అర్హులు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని కాగజ్‌నగర్ ఎంపీడీవో రమేశ్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికంగా మహిళలు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో డిమాండ్‌కు తగ్గట్టు మొక్కలు పెంచాలని, సరైన నిర్వహణ చేయాలన్నారు. ఆయా గ్రామాల కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

దహెగాం, ఏప్రిల్ 8 : రాజీవ్ యువ వికాస పథకం కోసం 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. పూర్తి వివరాల కోసం మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

## అమరుడు వేణుకుమార్‌గౌడ్ వర్ధంతి



వేణుకుమార్‌గౌడ్ వర్ధంతిలో అధికారులు, వివిధ పార్టీల నాయకులు

రెబ్బెన, ఏప్రిల్ 8 : తెలంగాణ మలి దశ ఉద్యమ సమయంలో ప్రాణ త్యాగం చేసిన తాళ్లపల్లి వేణుకుమార్‌గౌడ్ 13వ వర్ధంతిని మంగళవారం రెబ్బెన మండల కేంద్రంలో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు, అధికారులు నిర్వహించారు. వేణుకుమార్‌గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వేణుకుమార్‌గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలని పలువురు ఉద్యమకారులు కోరారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎస్ఐ చంద్రశేఖర్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మ, ఉద్యమకారులు మోడెం చిరంజీవిగౌడ్, పల్లె రాజేశ్వర్‌రావు, బొడ్డు రమేశ్, మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, మాజీ ఎంపీటీసీ పెసరి మధునయ్య, బీఆర్ఎస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, మసీదు కమిటీ అధ్యక్షుడు జహీర్‌బాబా పాల్గొన్నారు.

## ఉద్యోగులకు కౌన్సెలింగ్

కాసిపేట, ఏప్రిల్ 8 : మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై మంగళవారం 51 మంది గైర్హాజరు కార్మికులకు గని మేనేజర్ లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. గైర్హాజరు వల్ల కంపెనీకి, ఉద్యోగుల కుటుంబాలకు జరిగే నష్టాన్ని వివరించారు. వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి, ఏప్రిల్ 8 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యాన్ని ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం వాంకిడిలోని డీఆర్ డిపోలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆసిఫాబాద్ ఆర్డీవో, ఇన్‌చార్జి డీఆర్వో లోకేశ్వర్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం వాంకిడిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని సందర్శించారు. వేసవికాలంలో మొక్కలకు నీరు పోసి ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులు, పంచాయతీ సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ రియాజ్‌అలీ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రవీణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

నస్పూర్, ఏప్రిల్ 8 : ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంపులకు ఆసక్తి గల పీడీ, పీఈటీ, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా క్రీడా అధికారి కీర్తి రాజ్‌వీరు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 31 నిర్వహించాలని, తాగునీటి వసతి, మెడికల్ సౌకర్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి 8:30.., అలాగే సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు నిర్వహించాలని తెలిపారు. ఆసక్తి గల వారు 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఐడీఓసీ కార్యాలయంలోని రెండో అంతస్తు 28వ నంబర్ గదిలో స్వయంగా వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 99635 39234 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

కౌటాల, ఏప్రిల్ 8 : ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ అన్నారు. మండలంలోని తాటినగర్, మొగడ్‌ధగడ్ గ్రామాల్లో మంగళవారం పనులు నిర్వహిస్తున్న ఉపాధి కూలీల వద్దకు వెళ్లి, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కూలీలకు పని జరిగే చోట తాగునీరు, టెంటు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేవన్నారు. కూలీలకు రోజువారీ కూలి రూ.307 చెల్లించాలని, సౌకర్యాలు కల్పించాలని ఏపీవో పూర్ణిమతో ఫోన్‌లో మాట్లాడినట్లు ఆయన తెలిపారు.

## వేధింపులు మానుకోవాలి

జన్నారం, ఏప్రిల్ 8 : పులులు సంచరించని ప్రదేశంలో టైగర్‌జోన్ ఏర్పాటు చేసి, అటవీ, ఎన్జీవోలు ప్రజలను వేధించడాన్ని వెంటనే మానుకోవాలని సామాజిక కార్యకర్త శ్రీరాముల భూమాచారి హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రధాన రహదారిపై వెళ్లే వాహనాల డ్రైవర్లను కొట్టడంతో పాటు, టైగర్ జోన్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నవారిని వేధింపులకు గురిచేయడం ఆపాలన్నారు. అక్బర్, దాసరి తిరుపతి, విక్రమ్, సయ్యద్ హైమద్, సల్మాన్‌ఖాన్, సతీశ్, మనీశ్ పాల్గొన్నారు.

## నేడు మెగా రక్తదాన శిబిరం

మందమర్రి, ఏప్రిల్ 8 : మందమర్రి ఏరియాలోని వృత్తి శిక్షణ కేంద్రం(జీవీటీసీ)లో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తలసేమియా, సికిల్ సెల్ బాధితుల సహాయార్థం నిర్వహిస్తున్న ఈ శిబిరంలో కారుణ్య నియామక యువకులతో పాటు, ఇతరులు రక్తదానం చేసి సహకరించాలని కోరారు. బ్లడ్ బ్యాంకులో 832 మంది తలసేమియా, సికిల్ సెల్ బాధితులు రక్తం దొరకక మృత్యువుతో పోరాడుతున్నారని తెలిపారు.

## నీటి సమస్య లేకుండా చూడాలి

వేమనపల్లి, ఏప్రిల్ 8 : వేసవి దృష్ట్యా మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి ఎంపీడీవో కుమారస్వామి సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. రాజీవ్ యువ వికాసం దరకాస్తులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనులు ముమ్మరంగా చేపట్టాలని, పని జరిగే ప్రదేశాల్లో తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలన్నారు. ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధూకర్, టీఏ కృష్ణమోహన్, కార్యదర్శి జాఫర్, మేట్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మమేకానికే కమ్యూనిటీ పోలీసింగ్

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 8 : ప్రజలతో మమేకమయ్యేందుకే కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వర కాలనీలో మంగళవారం కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుపడకుండా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ కిరణ్ కుమార్, ఏఎస్ఐ ఇలియాస్ ఖాన్, బ్లూకోల్ట్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రత పాటించాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 8 : ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని వంద పడకల దవాఖాన ఆర్ఎంవో డాక్టర్ మూర్తి పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రత, కాయకల్పలో భాగంగా వంద పడకల దవాఖాన ఆధ్వర్యంలో మంగళవారం సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులు, కాల్‌టెక్స్ ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యుడు వరుణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ జోసెఫ్‌లీనా, హెడ్ నర్సులు షీలా, స్టెల్లా, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

కౌటాల, ఏప్రిల్ 8 : విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈవో గావుడే హన్మంతు పేర్కొన్నారు. మొగడ్‌ధగడ్ ప్రాథమికోన్నత, బాలెపల్లి ప్రాథమిక పాఠశాలలను మంగళవారం తనిఖీ చేశారు. 11వ తేదీ నుంచి 5వ తరగతి వరకు పరీక్షలు ప్రారంభమవనున్నందున ఎప్పటికప్పుడు విద్యార్థుల మార్కుల వివరాలను ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## వడదెబ్బ నివారణపై అవగాహన

శ్రీరాంపూర్, ఏప్రిల్ 7 : కార్మికులు వడదెబ్బ తగలకుండా పండ్ల రసాలు తీసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్, డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి సూచించారు. శ్రీరాంపూర్ ఆర్కే-7 గనిపై మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య సదస్సు నిర్వహించారు. ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, సేఫ్టీ ఆఫీసర్ సంతోష్‌రావు, పిట్ కార్యదర్శి సారయ్య, ఈఈ ప్రవీణ్, అధికారులు రాము, రవీందర్, లక్ష్మి, సీనియర్ పీవో సంతన్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెబ్బెన, ఏప్రిల్ 8 : రెబ్బెన మండల కేంద్రంలోని ఆదర్శకాలనీ, శ్రీరామకాలనీ, ప్రధాన రహదారి ప్రాంతంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రెబ్బెన ఏఈ ఇమ్రాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని సూచించారు.

## రేంజ్ ఆఫీసర్‌ను బదిలీచేయాలి

జన్నారం, ఏప్రిల్ 8 : కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న ఇందన్‌పెల్లి రేంజ్ ఆఫీసర్ కారం శ్రీనివాస్‌ను బదిలీ చేయాలని ఎఫ్‌డీపీటీ, డీఎఫ్‌వోలను జన్నారం మాజీ ఎంపీటీసీ మహ్మద్ రియాజుద్దీన్ కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. టైగర్ జోన్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో తాను పాల్గొన్నానని రేంజ్ ఆఫీసర్ కక్షగట్టారన్నారు. అందులో భాగంగానే కిష్టాపూర్‌లో దేవాలయ నిర్మాణానికి కొత్తపేట వాగు నుంచి తన తమ్ముడి ట్రాక్టర్‌లో ఏప్రిల్ 4న ఇసుక తరలిస్తుండగా, డ్రైవర్‌ను ఎఫ్‌బీవో రుబీనా, ఆమె భర్త దుర్భాషలాడారని పేర్కొన్నా రు. సమాచారం మేరకు తాము అక్కడి వెళ్లామని, స్థానిక పోలీస్టేషన్‌లో ఎస్ఐ రాజవర్ధన్‌కు సెక్షన్ ఆఫీసర్ హన్మంతరావుతో కలసి రాజీ ఒప్పంద పత్రం రాసిచ్చినట్లు వెల్లడించారు. అయినా తనపై కేసు పెట్టాలనే దురుద్దేశంతో ఎఫ్‌బీవోతో కలిసి రేంజ్ ఆఫీసర్ పనిచేస్తున్నాడని ఆరోపించారు.

## చలివేంద్రం ఏర్పాటు

లక్సెట్టిపేట, ఏప్రిల్ 8 : పట్టణంలోని తహసీల్ కార్యాలయానికి వచ్చే వారి దాహార్తి తీర్చేందుకు మంగళవారం కార్యాలయ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ తెలిపారు. కరిమల వాటర్ ప్లాంట్ యజమాని చింతల శ్రీనివాస్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు స్వయం ఉపాధి పొందాలి

మందమర్రి, ఏప్రిల్ 8 : వృత్తి శిక్షణ కోర్సులు పూర్తిచేసిన మహిళలు స్వయం ఉపాధి మార్గాలు ఏర్పాటు చేసుకొని కుటుంబాలకు అండగా నిలువాలని సింగరేణి సేవా సమితి మందమర్రి ఏరియా అధ్యక్షురాలు స్వరూపారాణి దేవేందర్ సూచించారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో అందుగులపేటలో నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ తరగతులు ఈ నెలతో ముగుస్తున్న సందర్భంగా బుధవారం సందర్శించారు. శిక్షకుల అల్లికలు, కుట్లను పరిశీలించారు. లేడీస్ క్లబ్ సభ్యులు కవిత, మనీ, సింగరేణి సేవా సమితి కో-ఆర్డినేటర్ నెల్సన్, కమ్యూనికేషన్ కో-ఆర్డినేటర్ నరేశ్, విక్షకురాలు రజిత తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

వేమనపల్లి, ఏప్రిల్ 8 : ఇటీవల యాజమాని వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న నాయిని కన్నయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మంచిర్యాల జిల్లా నాయకురాలు మర్మల మల్లేశ్వరి డిమాండ్ చేశారు. మంగెనపల్లి గ్రామంలోని బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. మృతికి కారణమైన చిన్నన్నరెడ్డి, అతడి భార్య లక్ష్మిపై కేసు నమోదు చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించకపోవడం బాధకరమని పేర్కొన్నారు. రామయ్య, రాజన్న, లక్ష్మి, కమల, బుచ్చయ్య, జయ, పోసక్క, దుర్గక్క పాల్గొన్నారు.

## 10 నుంచి పాలిసెట్ ఉచిత బోధన

మందమర్రి, ఏప్రిల్ 8 : సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సింగరేణి పాఠశాలలో 10వ తేదీ నుంచిటీఎస్ పాలిసెట్ ఉచిత బోధన తరగతులు నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు, ఇతర పాఠశాలల్లో చదువుతున్న సింగరేణి ఉద్యోగుల పిల్లలతో పాటు సీట్ల పరిమితి ప్రకారం బడుగు, బలహీన వర్గాల పిల్లలను కూడా అర్హులుగా గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బాల్య వివాహం అడ్డగింత

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 8 : ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామంలో మంగళవారం ఓ బాల్యవివాహాన్ని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులతో కలిసి తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే అడ్డుకున్నారు. అనంతరం బాలికను తాత్కాలిక వసతి కోసం సఖీ కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. ఎక్కడైనా చేస్తే 1098కి సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ బాల ప్రవీణ్ కుమార్, లైలా, చంద్రశేఖర్, రవళి, కానిస్టేబుల్ పండిట్ తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

కోటపల్లి, ఏప్రిల్ 8 : కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన దుర్గం రాము(23) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. ప్రేమ విఫలం కావడంతో మనోవేదనకు గురైన రాము, ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టు పక్కలవారు మెరుగైన వైద్యం కోసం చెన్నూర్‌కు, అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు. కాగా, పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## వృద్ధురాలి అదృశ్యం

కోటపల్లి, ఏప్రిల్ 8 : కోటపల్లి మండలం నాగంపేట గ్రామానికి చెందిన పత్తి పోసక్క(68) సోమవారం అదృశ్యమైనట్లు కోటపల్లి ఎస్ఐ రాజేందర్ మంగళవారం తెలిపారు. సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన పోసక్క తిరిగి రాలేదు. కాగా, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

## మహిళ మెడలో పుస్తెలు చోరీ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 8 : కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడలో మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో డోకె రోజారమణి మెడలో నుంచి గుర్తు తెలియని దుండగులు పుస్తేలు దొంగలించినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. రోజారమణి ఉదయం వాకిట్లో ముగ్గు వేస్తున్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియన వ్యక్తులు వచ్చి, పూలు కోసుకుంటామని మాటాలు కలిపారు. ఒక్కసారిగా ఆమెపై దాడి చేసి, మేడలోని మూడు తులాల పుస్తెలు దొంగిలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

జైపూర్, ఏప్రిల్ 8 : జైపూర్ పోలీస్టేషన్ పరిధి ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మంగళవారం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తికి చెందిన సంధ్యారాణి-తిరుపతి దంపతులు కారులో మంచిర్యాలలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద చెన్నూర్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన తుఫాన్ వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ సంధ్యారాణిని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

వేమనపల్లి, ఏప్రిల్ 8 : నీల్వాయి పోలీస్టేషన్ పరిధి కల్మపేటలో మంగళవారం పేకాట ఆడుతున్న పెరుగంటి రాజ్‌కుమార్, బొద్దున మోహన్‌రావు, సీపెల్లి ప్రదీప్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు. రూ.2,120 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## పాఠశాల వార్షికోత్సవం

చెన్నూర్, ఏప్రిల్ 8 : చెన్నూర్ పట్టణంలోని శార్వాణి ఇంగ్లిష్ మీడియం పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆలరించాయి. ముఖ్య అతిథిగా సీఐ దేవేందర్‌రావు హాజరయ్యారు. పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈవో రాధాకృష్ణమూర్తి, కరస్పాండెంట్ శ్రావణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలపై అవగాహన

మందమర్రి రూరల్, ఏప్రిల్ 8 : మండలంలోని సండ్రోన్‌పల్లి రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో రైతులకు నకిలీ పత్తి విత్తనాలపై అవగాహన కల్పించారు. చెన్నూర్ ఏడీఈ భానోత్ ప్రసాద్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాల వాడడం వల్ల భూమి సారవంతం కోల్పోయి రానున్న రోజుల్లో దిగుబడి తగ్గుతుందన్నారు. తహసీల్దార్ సతీశ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి కిరణ్మయి, పట్టణ ఎస్ఐ రాజశేఖర్, ఏఈవో ముత్యం తిరుపతి, కనకరాజు రైతులు పాల్గొన్నారు.

## సిద్ధేశ్వర్ దీక్షకు మద్దతు

మంచిర్యాల (ఏసీసీ), ఏప్రిల్ 8 : బీసీ ఉద్యమకారుడు బత్తుల సిద్ధేశ్వర్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా జిల్లా బీసీ జేఏసీ నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో నిరసన దీక్ష చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన 42 శాతం రిజర్వేషన్‌ను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, సమగ్ర కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు గుమ్ముల శ్రీనివాస్, వడ్డేపల్లి మనోహర్, వైద్య భాస్కర్, ఆడెపు గణేశ్, వేముల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సంఘ విద్రోహ శక్తులకు సహకరించవద్దు

కోటపల్లి, ఏప్రిల్ 8 : సంఘ విద్రోహ శక్తులకు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ హెచ్చరించారు. మండలంలోని వెంచపల్లి గ్రామ సమీపంలోని తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో మంగళవారం కోటపల్లి ఎస్ఐ రాజేందర్‌తో కలిసి పర్యటించారు. గల ప్రాణహిత తీరం వద్ద పడవల యజమానులు, మత్స్యకారులతో మాట్లాడారు. సరిహద్దులో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరించినా, కదలికలో తేడా కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి, గ్రామస్తులతో మాట్లాడారు. యువతకు క్రీడా కిట్లను అందచేశారు.

## ఎస్పీఎంలో ఎన్నికలు నిర్వహించాలి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 8 : కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని బీఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఆదిలాబాద్ డిప్యూటీ లేబర్ ఆఫీసర్ రాజేశ్వరికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నం రాజన్న, వెంకటేశ్, గణపతి, నానాజీ, రాంకుమార్, తదితరులు ఉన్నారు.

## నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

వాంకిడి, ఏప్రిల్ 3 : వాంకిడి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద బుధవారం సాయంత్రం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రియాజ్ అలీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరవ్వాలని సూచించారు.